శుక్రవారం 03-5-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 323, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

## కాంగ్రెస్ కోసం పాకిస్తాన్ కన్నీళ్లు పెట్టుకుంటుంది

### రాహుల్‌ను ప్రధాని చెయ్యాలని పాక్ తహతహ ● హస్తం పార్టీపై ప్రధాని మోడీ ఘాటు వ్యాఖ్యలు

**ముందడుగు ఢిల్లీ:**

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోడీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ యువరాజు కోసం పాక్ నేతలు ప్రార్థిస్తున్నారని ఆరోపించారు. వారి మధ్య బంధం తేటతెల్లమైందని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పాకిస్థాన్ మాజీ మంత్రి ప్రశంసలు కురిపించడం చర్చనీయాంశమైంది. దీనిపై బిజెపి నేతలు తీవ్రంగా విమర్శలు గుప్పించారు.



గుజరాత్‌లోని ఆనంద్ ప్రాంతంలో మోడీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై పాక్ ప్రశంసల అంశాన్ని ప్రస్తావించారు. దేశంలో కాంగ్రెస్ నానాటికీ బలహీనపడుతోంది. ఇక్కడ ఆ పార్టీ అస్థిత్వాన్ని కోల్పోతుంటే.. అక్కడ పాకిస్థాన్ కన్నీళ్లు పెట్టుకుంటోంది. కాంగ్రెస్ యువరాజును (రాహుల్‌ను ఉద్దేశిస్తూ) భారత ప్రధానిని చేయాలని దాయాది తహతహలాడుతోంది. ఆ పార్టీ పాక్‌కు అభిమాని అని మనకు తెలుసు. ఇప్పుడు వారి మధ్య భాగస్వామ్యం పూర్తిగా బయటపడింది అని మోడీ దుయ్యబట్టారు. భారత్‌లో బలహీన ప్రభుత్వం ఉండాలని మన శత్రువులు కోరుకుంటున్నారు. 26/11 ముంబయి దాడుల నాటి ప్రభుత్వం, 2014కు ముందున్న సర్కారు మళ్లీ అధికారంలోకి రావాలని ఆశపడుతున్నారు. అందుకే కాంగ్రెస్ కోసం పాక్ నేతలు ప్రార్థిస్తున్నారు అని మోడీ మండిపడ్డారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన ఫవాద్ హుస్సేన్ ఇటీవల తన సోషల్ మీడియా ఖాతాలో రాహుల్ గురించి ఓ పోస్ట్ పెట్టారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేత ప్రసంగించిన వీడియోను షేర్ చేసి.. 'రాహుల్ ఆన్ ఫైర్' అని రాసుకొచ్చారు. దీనిపై బిజెపి నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పాక్ మాజీ ప్రధాని రాహుల్‌ను ప్రమోట్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆ దేశంలో పోటీ చేయాలనుకుంటోందా? మేనిఫెస్టో దగ్గర నుంచి ఈ ప్రశంసల వరకు హస్తానికి దాయాదితో ఉన్న స్నేహం మరింత స్పష్టమైంది'' అని బిజెపి ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ విమర్శించారు.



## 223 మంది ఉద్యోగులు తొలగింపు

### ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సంచలన నిర్ణయం

**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ మహిళా కమీషన్‌కు చెందిన 223 మంది ఉద్యోగులను తొలగిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా సంచలన నిర్ణయం తీసుకున్నారు. తక్షణమే ఆ ఆదేశాలు అమలులోకి రానున్నాయి. గతంలో ఢిల్లీ మహిళా కమీషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన స్వాతిమాలివాల్ అక్రమాలకు పాల్పడిందని, ఎటువంటి అనుమతి లేకుండా ఉద్యోగులను మిగతా 2లో

## మా నియంత్రణ సిబిఐపై లేదు

### సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రప్రభుత్వం

**ముందడుగు పశ్చిమ బెంగాల్ :**




కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐపై తమ నియంత్రణ లేదని గురువారం సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కేంద్ర సంస్థ దర్యాప్తు సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోలేదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రాజ్యాంగంలో ఆర్టికల్ 131 ప్రకారం..కేంద్రంపై మిగతా 2లో

## బుల్డోజర్లతో సీఎం యోగి ఎన్నికల ర్యాలీ

### మెయిన్‌పురిలో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

వివరాలు 2లో

## ప్రజ్వల్ 400 మహిళలపై అఘాయిత్యం

వివరాలు 2లో



## అందరి నోట జెడీ మాట

వివరాలు 4లో



## అద్దె గర్భం ద్వారా 22 మంది పిల్లలకు తల్లి

వివరాలు 3లో



## మన దేశంలో కలుషిత ఆహారమే ఎక్కువ

వివరాలు 4లో

ముందడుగు
శుక్రవారం, 03-5-2024, హైదరాబాద్

# ప్రజ్వల్ 400 మహిళలపై అఘాయిత్యం

**ముందడుగు జాతీయం:**

దాదాపు 400 మంది మహిళలపై ప్రజ్వల్ అఘాయిత్యానికి పాల్పడి, వారి వీడియోలు చిత్రీకరించిన వ్యక్తి మాజీ ప్రధాని దేవేగౌడ మనవడు, హసన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై రాహుల్‌గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. అలాంటి వ్యక్తికి ఓట్లు వేయాలని ప్రధాని నరేంద్ర మోడీ కోరుతున్నారు. దేశ మహిళలకు అతను క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శివమొగ్గలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన ప్రజ్వల్‌ను మాస్ రేపిస్‌ట్‌గా పేర్కొన్నారు.

'ప్రజ్వల్ రేవణ్ణ 400 మంది మహిళలపై అఘాయిత్యానికి పాల్పడి, వారి వీడియోలు చిత్రీకరించాడు. ఇది సెక్స్ కుంభకోణం కాదు. ఇది అతిపెద్ద అత్యాచార ఘటన. ఓట్ల గురించి వాళ్లు (భాజపా కూటమి) అడుగుతున్నప్పుడు ప్రజ్వల్ ఏం చేశాడో ప్రతీ మహిళ తెలుసుకోవాలి. అతడి గురించి ప్రధానికి ముందే తెలుసు. అటువంటి వ్యక్తికి కర్ణాటక వేదికగా మోదీ మద్దతు పలికారు' అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజ్వల్ ఒక మాస్ రేపిస్ట్ అని భాజపాకు చెందిన ప్రతీఒక్క నేతకు తెలుసునని రాహుల్ గాంధీ ఆరోపించారు. అయినప్పటికీ అతడికి మద్దతు పలకడమే కాకుండా అతడి పార్టీతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. అటువంటి వ్యక్తికి ప్రచారం

- అటువంటి వ్యక్తికి ఓట్లు అడుగుతున్న మోడీ
- సంచలన ఆరోపణలు చేసిన రాహుల్‌గాంధీ



చేసినందుకు గాను దేశంలో ప్రతీ మహిళకు ప్రధాని మోదీ, అమిత్ షా సహా భాజపా నేతలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# 223 మంది ఉద్యోగులు తొలగింపు

మొదటిపేజీ తరువాయి

నియమించారని, రూల్‌స్‌కు వ్యతిరేకంగా నియామకం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. లెఫ్టినెంట్ గవర్నర్ ఆఫీసు తాజా ఆదేశాలను జారీ చేసింది. కేవలం 40 మంది ఉద్యోగులకు మాత్రమే అనుమతి ఇస్తూ ఢిల్లీ మహిళా కమీషన్ ఆదేశాలు ఇచ్చిందని, కానీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి లేకుండా 223 కొత్త పోస్టులను అప్రూవ్ చేశారని ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఉద్యోగులను కాంట్రాక్టు ఆధారంగా నియమించే అధికారం కమీషన్‌కు లేదని ఆ ఆదేశాల్లో తెలిపారు. ఆర్థికశాఖపై భారం పడే ఎటువంటి నిర్ణయాలను కమీషన్ తీసుకోవద్దు ఆదేశాల్లో స్పష్టం చేశారు.

# మా నియంత్రణ సిబిఐపై లేదు

## సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

బెంగాల్ ప్రభుత్వం కేసు వేసింది. సీబీఐకి ఇచ్చిన సాధారణ సమ్మతిని రాష్ట్రం ఉపసంహరించుకున్నా.. దర్యాప్తు సంస్థ ఎఫ్ఐఆర్ నమోదు చేసి రాష్ట్రంలో కేసులను దర్యాప్తు చేస్తోందని ఆరోపించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 కేంద్రం, రాష్ట్రాల అధికార పరిధికి సంబంధించింది. అయితే, కేంద్రం ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టుకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనానికి రాజ్యాంగంలోని 131వ అధికరణం రాజ్యాంగంలోని అత్యంత పవిత్రమైన అధికార పరిధి అని, అందులోని నిబంధనలు ఉండవని చెప్పారు. కేసులను భారత ప్రభుత్వం దాఖలు చేయలేదని, సీబీఐ నమోదు చేసిందని ఎస్‌జీ తెలిపారు. సీబీఐ కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో లేదని తెలిపారు. వాస్తవానికి 2018 నవంబర్ 16న బెంగాల్ ప్రభుత్వం రాష్ట్రంలో సీబీఐకి దర్యాప్తు చేసేందుకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకుంది. దాంతో బెంగాల్‌లో సీబీఐ దాడులు జరుపడం, దర్యాప్తు చేయలేదు. అయితే, ఇటీవల ఈడీ బృందంపై జరిగిన దాడిని సీబీఐ దర్యాప్తు చేస్తున్నది. సందేశ్‌ఖాలీలో అక్రమ భూకబ్జా తదితర కేసులపై సైతం విచారణ జరుపుతుండగా.. బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

# కొడుకు లావుగా ఉన్నాడని బలవంతంగా ట్రెడ్‌మిల్


## ట్రెడ్‌మిల్‌పై పడి గాయాలపాలై మృతి



**ముందడుగు జాతీయం :**

కన్న కొడుకు లావుగా ఉన్నాడని భావించిన తండ్రి ట్రెడ్‌మిల్‌పై బలవంతంగా పరిగెత్తించాడు. బాలుడి వయసును కూడా చూడకుండా వేగాన్ని విపరీతంగా పెంచాడు. దీంతో అభంశుభం తెలియని ఆ బాలుడు గాయాలపాలై కొన్ని రోజులకు ప్రాణాలు విడిచాడు. అమెరికాలో మూడేళ్ల క్రితం జరిగిన ఈ విషాదకర ఘటనకు సంబంధించిన దృశ్యాలు విచారణ కారణంగా వెలుగులోకి వచ్చాయి.

కుమారుడి మృతికి కారణమయ్యాడన్న అభియోగాలపై న్యూజెర్సీకి చెందిన క్రిస్టోఫర్ గ్రెగర్ 2021లో అరెస్టయ్యాడు. ఈ కేసుకు సంబంధించి తాజాగా కోర్టులో విచారణ జరగగా బాలుడి మృతికి కారణమైన ట్రెడ్‌మిల్ పరుగు దృశ్యాలను సాక్ష్యాలుగా న్యాయస్థానంలో ప్రదర్శించారు. ఆ ఏడాది మార్చి 20న క్రిస్టోఫర్ తన కుమారుడు కోరీని తీసుకుని స్థానికంగా ఉన్న ఓ ఫిట్‌నెస్ సెంటర్‌కు తీసుకెళ్లాడు. బాలుడు లావుగా ఉన్నాడని ట్రెడ్‌మిల్‌పై పరిగెత్తించాడు. అతడికి కష్టంగా అనిపిస్తున్నా సరే వేగాన్ని చాలా పెంచాడు. దీంతో ఆ బాలుడు పలుమార్లు కిందపడిపోయాడు. అయినప్పటికీ ఆగకుండా ఆ తండ్రి బలవంతంగా తన కొడుకును ట్రెడ్‌మిల్ ఎక్కించాడు. వద్దని చెబితే కొట్టాడు. కొన్ని రోజులకు అతడు తీవ్ర అనారోగ్యానికి గురవడంతో 2021 ఏప్రిల్ 1న బాలుడిని తల్లి ఆసుపత్రికి తీసుకెళ్లగా అసలు విషయం బయటపడింది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. ఆ మరుసటిరోజే ఆ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. స్కానింగ్‌లో అతడి అంతర్గత అవయవాలకు తీవ్ర గాయాలైనట్లు తేలింది. గుండె, కాలేయంపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల కారణంగా అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అదే ఏడాది జులైలో క్రిస్టోఫర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో ఈ దృశ్యాలను చూసి బాలుడి తల్లి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ కేసులో అతడికి జీవితఖైదు పడే అవకాశముంది.



# ఇంటికి వచ్చిన డెలివరీ పార్సిల్ పేలింది

## ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు

**ముందడుగు క్రైం:**

ఇంటర్నెట్ అందరికి అందుబాటులో ఉండడంతో ఆన్ లైన్ బుకింగ్, ఆన్ లైన్ పార్సిల్ మామూలైపోయింది. అలాంటిది ఒక ఇంటికి డెలివరీ పార్సిల్ వచ్చింది. అది విప్పగానే ఒక్కసారి పార్సిల్ పేలింది. ఈ సంఘటనలో ఒక వ్యక్తి, అతడి కుమార్తె మరణించారు. మరో ఇద్దరు కుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు. గుజరాత్‌లోని వడాలిలో ఈ సంఘటన జరిగింది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన వస్తువు పార్సిల్ ద్వారా ఒక ఇంటికి డెలివరీ అయ్యింది. అయితే బుధవారం ఆ పార్సిల్ పేలింది. జితేంద్ర హీరాభాయ్ వంజారా, ఆయన కుమార్తె భూమిక వంజారా ఈ సంఘటనలో మరణించారు. 9, 10 ఏళ్ల వయస్సున్న మరో ఇద్దరు కుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పార్సిల్ పేలి ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడటంపై స్థానికులు భయాందోళన చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాంబు స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. పార్శిల్‌ను ఎవరు డెలివరీ చేశారు? అది ఎందుకు పేలింది? అన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బుల్డోజర్లతో సీఎం యోగి ఎన్నికల ర్యాలీ

## మెయిన్‌పురిలో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) కంచుకోటలో ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. సుమారు మూడు కిలోమీటర్ల వరకు సాగిన రోడ్ షోలో యోగి పాలనలో మార్కుగా నిలిచిన బుల్డోజర్లు కూడా పాల్గొన్నాయి. ఎస్పీ వ్యవస్థాపకుడు, దివంగత ములాయం సింగ్ యాదవ్ స్వస్థలమైన మెయిన్‌పురిలో బీజేపీ అభ్యర్థి జైవీర్ సింగ్‌కు మద్దతుగా సీఎం యోగి ఆదిత్యనాథ్ రోడ్ షో నిర్వహించారు. సుమారు పద్నాలుగు బుల్డోజర్లు కూడా ఈ రోడ్ షోలో పాల్గొన్నాయి.

ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్ మెయిన్‌పురి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. రెండేళ్ల కిందట ములాయం సింగ్ యాదవ్ మరణం నేపథ్యంలో జరిగిన ఉప ఎన్నికల్లో సుమారు 3 లక్షల మెజార్టీతో బీజేపీ అభ్యర్థిపై



ఆమె గెలిచారు. మరోవైపు 1996 నుంచి మెయిన్‌పురి లోక్‌సభ నియోజకవర్గంలో ఎస్పీ ఎప్పుడూ ఓడిపోలేదు. దీంతో ఈ స్థానం ఎస్పీకి కంచుకోటగా నిలిచింది. అయితే 2022 అసెంబ్లీ ఎన్నికల్లో మెయిన్‌పురి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను రెండింటిని బీజేపీ గెలుచుకుంది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో మెయిన్‌పురి స్థానంపై బీజేపీ దృష్టిసారించింది.

ముందడుగు
శుక్రవారం, 03-5-2024, హైదరాబాద్

# అద్దె గర్భం ద్వారా 22 మంది పిల్లలకు తల్లి

## మరింత మంది పిల్లలు కావాలంటున్న క్రిస్టినా



**ముందడుగు జాతీయం:**

చాలా మంది మహిళలు పిల్లలు కావాలని తహతహలాడుతారు. కానీ టర్కీకి చెందిన ఓ ధనవంతుడి భార్య క్రిస్టినా ఓజ్‌టుర్క్ వయస్సు కేవలం 26 ఏళ్లు.. కానీ ఆమె ఇప్పటికే అద్దె గర్భం ద్వారా 22 మంది పిల్లలకు తల్లి అయ్యింది. రష్యాలో జన్మించిన బ్లాగర్ మార్చి 2020, జూలై 2021 మధ్య తన మిలియనీర్ వ్యాపారవేత్త భర్త గాలిప్ సర్రోగేట్ ద్వారా పిల్లలను కంటూ ఈ ప్రపంచానికి పరిచయం చేసింది. అయితే, క్రిస్టినా తనకు మరింత మంది పిల్లలు కావాలని ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. ఆమె పెద్ద బిడ్డ, విక్టోరియా అనే ఎనిమిదేళ్ల కుమార్తె గతంలో ఉన్న భాగస్వామితో సహజంగా జన్మించింది. ఇక, క్రిస్టినాకు చిన్న పిల్లలతో కూడిన పెద్ద కుటుంబం ఉంది. క్రిస్టినా గతంలో తాను మూడు అంకెలను చేరుకోవాలని కోరుకుంటున్నట్లు వెల్లడించింది. గతేడాది ఫిబ్రవరిలో క్రిస్టినా సరోగసీలకు రూ.1 కోటి 43 లక్షలు చెల్లించింది. క్రిస్టినా బేబీస్ డైరీ అనే పుస్తకాన్ని కూడా విడుదల చేసింది. అందులో పిల్లలను పెంచడం గురించి ప్రతిదీ ఇప్పటికే వ్రాయబడింది. అయితే, ప్రతి రోజు ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమమైన వాటిని మాత్రమే అందించడానికి ఉపయోగకరమైన సమాచారం కోసం చూస్తున్నారని ఆమె చెప్పింది.

## టొయోటా రూమియన్‌ను పరిచయం చేసిన

# టొయోటా కిర్లోస్కర్ మోటర్

**ముందడుగు హైదరాబాద్**

టొయోటా కిర్లోస్కర్ మోటర్ గురువారం అధికారికంగా టొయోటా రూమియన్ యొక్క కొత్త గ్రేడ్ జీAT ధరతో పాటు ఈసిఎన్జీ బుకింగ్‌లను తిరిగి తెరిచినట్లు అధికారికంగా ప్రకటించింది. కొత్తగా విడుదల చేసిన GAT వేరియంట్ దాని సాటిలేని స్థలం , సౌకర్యం, అద్భుతమైన ఇంధన సామర్థ్యం, ఆకర్షణీయమైన మరియు ప్రీమియం బాహ్య డిజైన్‌తో రూమియాన్ యొక్క మార్కెట్ ఆమోదాన్ని మరింత పెంచుతుందని భావిస్తున్నారు.




టికెఎం వైస్ ప్రెసిడెంట్ సేల్స్ అండ్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ శబరి మనోహర్, “టొయోటా రూమియన్ లైనప్‌కి కొత్త గ్రేడ్‌ను జోడించడానికి మేము సంతోషిస్తున్నాము, జీAT వేరియంట్ బుకింగ్‌లు ఇప్పుడు తెరవబడ్డాయి. ఆగస్ట్ '23లో విడుదల చేసినప్పటి నుండి, టయోటా రూమియన్ కస్టమర్‌లలో ఉత్సాహాన్ని సృష్టించింది. ఆరోగ్యకరమైన బుకింగ్‌లకు దారితీసింది. మా విలువైన కస్టమర్‌లు చూపిన ప్రేమ మరియు నమ్మకాన్ని మేము ఎంతో అభినందిస్తున్నాం అన్నారు.

KARDA CONSTRUCTIONS & DEVELOPERS

**కేబీసీ గ్లోబల్ లిమిటెడ్లో**

## వాటా కొనుగోలు చేసిన మినర్వా వెంచర్స్ ఫండ్

**ముందడుగు హైదరాబాద్:**

26 ఏప్రిల్ 2024 న ఎన్ఎస్ఇలో బల్క్ డీల్లో కెబిసి గ్లోబల్ లిమిటెడ్ యొక్క 1% ఈక్విటీని (1 కోటి షేర్లు) ఫండ్ రూ .2.05 చొప్పున కొనుగోలు చేసింది. అమెరికాకు చెందిన మినర్వా వెంచర్స్ ఫండ్ నిర్మాణ, రియల్ ఎస్టేట్ అభివృద్ధి రంగంలో ప్రముఖ సంస్థ అయిన కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ (గతంలో కర్దా కన్స్ట్రక్షన్ లిమిటెడ్) బీఎస్ఈ 541161 వాటాను కొనుగోలు చేసింది. 26 ఏప్రిల్ 2024 న నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్లో అందుబాటులో ఉన్న బల్క్ డీల్ డేటా ప్రకారం, మినర్వా వెంచర్స్ ఫండ్ కెబిసి గ్లోబల్ లిమిటెడ్ యొక్క 1% ఈక్విటీని (1 కోటి షేర్లు) ప్రతి షేరుకు రూ .2.05 చొప్పున కొనుగోలు చేసింది.

దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విస్తరణ కోసం వ్యూహాత్మక ప్రణాళికను కూడా కంపెనీ ప్రకటించింది. కంపెనీ వృద్ధి పథంపై కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నరేష్ కర్దా మాట్లాడుతూ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఉన్న అవకాశాలపై తాము ఉత్సాహంగా ఉన్నామని చెప్పారు. మా వ్యూహాత్మక చొరవలు, బలమైన ప్రాజెక్టుల పోర్ట్ఫోలియో మరియు విస్తరణపై స్పష్టమైన దృష్టి, కర్దా కన్స్ట్రక్షన్ లిమిటెడ్ ప్రపంచ రియల్ ఎస్టేట్ ల్యాండ్ స్కేప్లో కీలక పాత్ర పోషిస్తుంది.



# హాట్ ఎయిర్ బెలూన్‌పై ఓటు హక్కు అవగాహన

## ఈసీ వినూత్న రీతిలో అవగాహన

**ముందడుగు కర్ణాటక:**

దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. దేశంలో మొత్తం ఏడు విడతల్లో పోలింగ్ జరుగుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు విడతల ఓటింగ్ పూర్తైంది. తొలి విడత ఓటింగ్ ఏప్రిల్ 19, రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 26న ముగిశాయి. ఇక మూడో విడత ఎన్నికలు మే 7న జరగనున్నాయి. ఇందులో భాగంగా ఓటింగ్‌పై ప్రజలకు కేంద్ర ఎన్నికల సంఘం వినూత్న రీతిలో అవగాహన కల్పిస్తోంది. మూడో విడత పోలింగ్ నేపథ్యంలో కర్ణాటకలోని బెళగావి ఎన్నికల సంఘం ఎన్నడూ లేనివిధంగా హాట్ ఎయిర్ బెలూన్‌ను ఎగురవేసి నగర వాసులకు ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తోంది. ప్రతి ఒక్కరూ బయటకు వచ్చి తన అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఇక మే 7న మూడో విడత పోలింగ్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా మొత్తం 94 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది.

# పరకాలలో ఓటరు అవగాహన ర్యాలీ




**ముందడుగు పరకాల:**

రానున్న లోక్ సభ సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేలా అవగాహన ర్యాలీని హన్మకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు పరకాలలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలి నుండి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేసి అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఇంచార్జ , అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి జిల్లా వ్యాప్తంగా స్వీప్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ , పరకాల ఏసీపీ, మునిసిపాలిటీ కమీషనర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ , సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది, అంగవాడి సిబ్బంది , మునిసిపల్ సిబ్బంది , ఆశ వర్కర్లు, కళాకారుల బృందం , ప్రజలు పాల్గొన్నారు.



## 'హరి హర వీర మల్లు' టీజర్ విడుదల

భారతదేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన కథనాయకులలో పవన్ కళ్యాణ్ ఒకరు. ఆయన నటించిన సినిమా వస్తుందంటే తెలుగు రాష్ట్రాల్లో ఉండే సందడే వేరు. పవన్ కళ్యాణ్ చిత్రానికి సంబంధించిన చిన్న వార్త కూడా పండుగ వాతారణాన్ని తలపిస్తుంది. అలాంటి పవన్ కళ్యాణ్ తన కెరీర్‌లో మొదటిసారిగా 'హరి హర వీర మల్లు' అనే పీరియాడికల్ యాక్షన్ అడ్వెంచర్ సినిమాలో నటిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం అత్యంత భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 17వ శతాబ్దంలో పేదల పక్షాన పోరాడిన ఒక యోధుడి కథగా రూపొందుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం కోసం, నిర్మాతలు ప్రత్యేకంగా చార్మినార్, ఎర్రకోట మరియు మచిలీపట్నం ఓడరేవు వంటి భారీ సెట్‌లను అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. వీరమల్లుగా వెండితెరపై పవన్ కళ్యాణ్ సాహసాలను చూడటం కోసం అభిమానులు, సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారి ఎదురుచూపులు ఫలించాయి. తాజాగా నిర్మాతలు ఓ తీపి కబురు చెప్పారు. ఈ చిత్రం రెండు భాగాలుగా రానుందని ప్రకటిస్తూ, మొదటి భాగం నుండి టీజర్‌ను విడుదల చేశారు. మొదటి భాగం "హరి హర వీర మల్లు పార్ట్-1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్" పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. "ధర్మం కోసం యుద్ధం" అనేది ఉపశీర్షిక. పేద, అణగారిన వర్గాలకు అండగా నిలబడే వీరుడిలా పవన్ కళ్యాణ్ కనిపిస్తుంటే, మొఘల్ చక్రవర్తిగా ప్రముఖ హిందీ నటుడు బాబీ డియోల్ కనిపిస్తున్నారు. ఆహార్యం పరంగా, అభినయం పరంగా ఇద్దరూ ఆయా పాత్రలకు వన్నె తెచ్చారని టీజర్ తోనే అర్థమవుతోంది. టీజర్ లో రోమాలు నిక్కబొడుచుకునేలా చేసే అంశాలు ఎన్నో ఉన్నాయి.





# అందరి నోట జెడీ మాట

## ఉత్తర విశాఖలో విశేష ఆదరణ ● ఎక్కడికెళ్లినా ప్రజలు నీరాజనాలు

**ముందడుగు విశాఖపట్నం:**

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో జై భారత్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సిబిఐ జెడీ లక్ష్మినారాయణకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. ప్రజల రక్షణకు, విశాఖ పరిరక్షణకు జెడీ కావాలి, జెడీ గెలవాలి అంటూ ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ఉత్తర విశాఖలోని సీతమ్మ ధార వీధుల్లోని ప్రజలను ముఖాముఖి కలిశారు. జెడి లక్ష్మి నారాయణను చూడగానే ప్రజలు మీలాంటి నాయకుడే విశాఖ నగరానికి కావాలని చెపుతున్నారు. అపార్ట్ మెంటులోని ప్రజలతో పాటు, కలిసిన ప్రతి ఒక్కరిని పలకరిస్తూ జై భారత్ ఎందుకు పోటీ చేస్తుందో వివరించారు. అక్కడి నుంచి అక్కయ్యపాలెంలోని పలు ప్రాంతాల అపార్టుమెంటుల లో ప్రజలను నేరుగా కలిశారు.

### అందరూ ఓటెయ్యండి, వేపించండి

రాబోయే తరాల కోసం, మీ పిల్లల భవిష్యత్తు కోసం మార్పుకు శ్రీకారం చుట్టాల్సిన బాధ్యత మీపై ఉందని అందుకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వలేదు, విభజన హామీ లేదు, స్టీల్ ప్లాంట్ ప్రత్యేక హోదాపై ఎవరికి పట్టింపు లేదు అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం ఏం చేశాయనేది మాత్రం ఎవరిదగ్గర సమాధానం లేదు. అందుకే ఒక మార్పు దిశగా జై భారత్ పార్టీ అడుగులు వేస్తోంది. మా అడుగులు అవినీతి రహిత రాజకీయాల కోసం నిరంతరం కొనసాగుతాయి అన్నారు.

### ఓటర్ల నుంచి విశేష స్పందన

మిగతా పార్టీల మేనిఫెస్టోల కంటే మా పార్టీ మేనిఫెస్టో భిన్నంగా ఉంటుంది. ఉపాధి, సంపద సృష్టి, సంక్షేమం అంతేకాని ప్రజలకు ఉచితాలనేవి జై భారత్ పార్టీ ఎక్కడ కూడా మాట్లాడ లేదు. ఎందుకంటే రాష్ట్రం ఇప్పటికే 11లక్షల కోట్ల అప్పుల్లో ఉందని తెలుస్తోంది. వైకాపా, టిడిపి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ స్టాంపు పేపర్ మీద ప్రజలకు రాసి ఇవ్వండి. రుణమాఫీ చేయలేదు, మద్య పాన నిషేధం చేయలేదు.





# మన దేశంలో కలుషిత ఆహారమే ఎక్కువ

## 527 రకాల ఆహారాలు కలుషితమవుతున్నాయి ● రోగ కారకాలు లేదా రసాయనాలతో కలుషితం

**ముందడుగు ప్రత్యేకం:**

మనిషి ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే మనం తీసుకునే ఆహారమే ఆరోగ్యం. శరీరానికి పోషకాలు అందించకపోతే చాలా రకాల ఇబ్బందులు తలెత్తుతాయి. కాని ఏటా ప్రపంచ వ్యాప్తంగా కలుషిత ఆహారం సమస్య తీవ్రమవుతోంది. ప్రపంచ జనాభాను కలుషిత ఆహారం తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. మన దేశంలో 527 రకాల ఆహారాలు కలుషితమవుతున్నాయని వివిధ నివేదికలు పేర్కొంటున్నాయి. అసలు ఆహారం కలుషితం అంటే ఏంటి? ఇది ఎన్ని రకాలు? తీసుకోవాల్సిన నివారణ చర్యలేంటో ఇప్పుడు చూద్దాం.

### ఆహార కలుషితం అంటే ఏంటి?

ఆహార ఉత్పత్తుల్లోకి బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులు, రసాయనాలు లేదా టాక్సిన్స్ వంటి హానికరమైన పదార్థాలు, జీవులు ప్రవేశిస్తే అవి కలుషితమవుతాయి. ప్రాసెసింగ్, రవాణా, స్టోరేజ్ వంటి ఏదో ఒక దశలో ఆహార ఉత్పత్తులు కలుషితమవుతున్నాయి. మనదేశంలో కలుషితమవుతున్న ఆహారాల జాబితాలో ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పాల ఉత్పత్తులు, మాంసం, సుగంధ ద్రవ్యాలు, ప్యాక్డ్ స్నాక్స్ వంటివి ఉన్నాయి. ఈ ఆహారాలు వివిధ రోగ కారకాలు లేదా రసాయనాలతో కలుషితం కావచ్చు. వీటిని ఆహారంగా తింటే రోగాల రిస్క్ పెరుగుతుంది.



### ఆహార కలుషితానికి కారణాలు

భారతదేశంలో ఆహారం కలుషితం కావడానికి అనేక కారణాలు ఉన్నాయి. పారిశుద్ధ్యం లేకపోవడం, సరైన పరిశుభ్రత పద్ధతులు పాటించకపోవడం, ఫుడ్ ప్రాసెసింగ్ సరిగా చేయకపోవడం, నిల్వ, రవాణా సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రధాన కారణాలు. అలానే పురుగు మందుల అధిక వినియోగం వల్ల కూడా ఆహార పదార్థాలు కలుషితం అవుతున్నాయి.

### ఆరోగ్య సమస్యలు

కలుషితమైన ఆహారాన్ని తింటే అనేక రకాల రోగాలు బెడద ఉంటుంది. కడుపులో అసౌకర్యం, వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలు వేధించవచ్చు. కొన్ని సందర్భాల్లో మరణం సంభవించే అవకాశం లేకపోలేదు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలకు కలుషిత ఆహారంతో హెల్త్ రిస్క్ అధికంగా ఉంటుంది.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తినడానికి ముందు పండ్లు, కూరగాయలు వంటి వాటిని బాగా కడగాలి. హానికర బ్యాక్టీరియాను చంపడానికి మాంసం, పౌల్ట్రీ, సీఫుడ్‌లను బాగా ఉడికించాలి. పరిశుభ్రమైన పరిసరాల్లో ఆహారాన్ని సరిగ్గా నిల్వ చేయాలి. పచ్చి లేదా సరిగా వండని ఆహారాలను తినకపోవడం మంచిది. అలానే ప్యాక్డ్ లేదా ప్రాసెస్ చేసిన ఆహారాలను కొనుగోలు చేసేటప్పుడు లేబుల్స్ జాగ్రత్తగా పరిశీలించాలి. ఆరోగ్య అధికారులు సూచించిన ఆహార భద్రత మార్గదర్శకాలు పాటించాలి.

### ప్రభుత్వాల పాత్ర

ఆహార భద్రతతో పాటు కలుషితం నివారించడంలో ప్రభుత్వాల పాత్ర కీలకం. ఆహార ఉత్పత్తి, ప్రాసెసింగ్, పంపిణీ ప్రక్రియల్లో కఠినమైన నిబంధనలు, ప్రమాణాలను తూచా తప్పకుండా అమలు చేయాలి. ఆహార భద్రతా ప్రమాణాలను నిర్వహించడానికి ఆహార సంస్థలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తుండాలి. ఉల్లంఘనలకు పాల్పడినవారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఆహార భద్రతపై ప్రభుత్వాలు, ప్రజా సంఘాలు ప్రజలకు అవగాహన కల్పించాలి.